క్లుప్తంగా

రైతు బజార్ ఈఓల బదిలీ


వినోద్ బాబు


సుధాకరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని రెండు రైతుబజార్ల కార్యనిర్వహణాధికారులను బదిలీ చేశారు. పత్తేబాద రైతు బజారు ఈఓను ఒన్‌టౌన్‌కు, ఒన్‌టౌన్ రైతు బజారు ఈఓను పత్తేబాదకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పత్తేబాద రైతు బజారు ఈఓగా కె.వినోద్ బాబు, ఒన్ టౌన్ ఈఓగా ఎం సుధాకర రావు బాధ్యతలు స్వీకరించారు. రైతు బజారుల్లో వినియోగదారుల సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి, నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు అందించడానికి కృషి చేస్తామని ఈఓలు తెలిపారు.

లక్ష్మీ గణపతికి బంగారు హారం సమర్పణ


బంగారు హారాన్ని అర్చకునికి అందిస్తున్న దాతలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి దేవస్థానంలో స్వామి వారి అలంకరణ నిమిత్తం సత్రంపాడుకు చెందిన భక్తులు బలుసు సుబ్బయ్య చౌదరి, కనకదుర్గ దంపతులు 21 గ్రాముల 620 మిల్లీ గ్రాముల నికర బరువు (రూ.2 లక్షలు) గల బంగారు హారాన్ని మంగళవారం సమర్పించారు. దాత దంపతులను ఆలయ అర్చకులు ఆర్ రాఘవేంద్ర కుమార్ దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి ఆశీస్సులు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రీ సర్వేలో పారదర్శకత పాటించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపు గ్రామాల రీ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీ సర్వేపై గ్రామాల్లో ముందస్తు సమాచారం తెలపాలని కోరారు. ఇప్పటికే కొందరికి పరిహారం చెల్లించారని, ఉపాధిని నిమిత్తం వలసలు వెళ్లిన నిర్వాసితులను, విద్యాభ్యాసం నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వెళ్లే యువతనూ స్థానికులుగా గుర్తించి, 18 ఏళ్లు నిండిన యువతకు కటాఫ్ తేదీని సవరించి పరిహారం చెల్లించాలని కోరారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

పెదవేగి : పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేసినట్టు ఎంపీడీఓ పులవర్తి శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అధికారులంతా తమ శాఖల పూర్తి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఈ–క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శన

ఉంగుటూరు: ఈ–క్రాప్ నమోదు ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. రబీ సాగుకు సంబంధించి రైతుల ఈ–క్రాప్ నమోదు ముగిసిందన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా ముసాయిదాపై అభ్యంతరాలు ఉంటే గ్రామ సభల్లో తెలియజేయాలని కోరారు. రైతులు ధ్రువీకరించిన వివరాలతో జాబితాలో మార్పు, చేర్పులు చేస్తామని పేర్కొన్నారు. తుది జాబితాను ఈ నెల 22 నుంచి రైతు సేవ కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

పేదల ఇళ్లపై పగ

- జగనన్న కాలనీల్లో నిలిచిన పైప్‌లైన్ పనులు
- నీటి కోసం అవస్థలు

ఏలూరు రూరల్: ఏళ్ల తరబడి ఎదురు చూసిన పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం లభించింది. కాలనీల్లో విద్యుత్ స్తంభాలు పాతారు. తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుచేశారు. రోడ్డు పనులు చేపట్టారు. ఎంతో ఆనందంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించే నాటికి ఎన్నికలు వచ్చాయి. పనులన్నీ ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాజీ సీఎం జగన్‌పై కక్షతో జగనన్న కాలనీలను నిర్వీర్యం చేసే కుట్రకు పూనుకుంది. ఇళ్ల లబ్ధిదారులకు ఇచ్చే ఐరన్, సిమెంట్, ఇసుక సరఫరాను నిలిపేసింది. రోడ్ల నిర్మాణానికి నిధులకు బ్రేక్ వేసింది. పైప్‌లైన్ పనులు అడ్డంకులు సృష్టించింది. ఆఖరికి పైడిచింతపాడు, పోణంగి తదితర కాలనీల్లో మొరాయించిన బోర్లను సైతం అధికారులు బాగు చేయడం లేదు. ఇళ్ల నిర్మాణానికి నీరు అందుబాటులో లేదు. ఎనిమిది నెలలుగా గోడలు ఎండలో ఎండి, వర్షం వస్తే తడుస్తున్నాయి. ఇదీ జగనన్న కాలనీల్ల లబ్ధిదారుల ఆవేదన.


పోణంగిలో నీరులేక అసంపూర్తిగా నిలిచిన ఇళ్లు


కొమడవోలు జగనన్న కాలనీల్లో నీరు లేక నిలిచిన ఇళ్లు

నిలిచిన నిర్మాణాలు

వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహించారు. ఏలూరు, ఏలూరు రూరల్, పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లోని 132 జగనన్న కాలనీ లే అవుట్లలో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.605.74 లక్షల మంజూరు చేశారు. వీటితో ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, పెదపాడులో పలు కాలనీల్లో 45 శాతం పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. కనీసం 50 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాని కాలనీల్లో పైప్‌లైన్ పనులు నిలిపేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించడంతో 9,510 మంది లబ్ధిదారుల ఇళ్లకు నీటి సరఫరా అందుబాటులోకి రాకుండా పోయింది. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపేశారు.

పైప్‌లైన్‌కు నిధుల మంజూరు ఇలా..

మండలం	లే అవుట్లు	ఖర్చు రూ.లక్షల్లో..	లబ్ధిదారులు
పెదవేగి	47	187.92	3451
పెదపాడు	45	210.26	3239
దెందులూరు	31	181.36	2114
ఏలూరు	9	26.2	697

నిర్మాణం నిలిచిపోయింది



నా ఇల్లు సగంలోనే నిలిచిపోయింది. నీరు లేవు. ఎక్కడో దూరం నుంచి నీరు తెచ్చి ఇల్లు కట్టాలంటే కష్టమవుతోంది. చేసేది లేక పనులు ఆపేశాను. ఇప్పుడు మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. కనీసం నీరు కూడా ఇవ్వకపోతే కాలనీల్లో ఇల్లు ఎలా కట్టుకోగలం. ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదు.
– విజయ, పోణంగి

పేదలకు అన్యాయం



జగన్ హయాంలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కాలనీల్లో రోడ్లు, వీధిలైట్లు, తాగు నీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులు చేశారు. మిగిలిన పనులకు సీఎం చంద్రబాబు నిధులు ఆపేశారు. కనీసం కొత్త ఇళ్లూ మంజూరు చేయడం లేదు. ఇది చాలా అన్యాయం. పేదల జీవితాలను నాశనం చేశారు.
– ముంగర సంజీవ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు

16న హేలాపురి సంగీత వైభవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం గుడిపాటి లలిత సంగీత నిర్వహణలో హేలాపురి సంగీత వైభవం పేరిట సంగీత కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

డీఎల్ఎస్ఏ సేవలపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు) ప్రజలకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు మధ్య వారధిగా పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్థానిక ఎన్జీఓ సంఘాలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో వివిధ ఎన్జీఓ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


వాకర్స్ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ మోతే వారి తోట శుభోదయం పార్కు వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా కల్లూరి సూరిబాబు, కార్యదర్శిగా దోర వీరవెంకట గంగాధర్, కోశాధికారిగా పీఎస్ఆర్‌కే లింగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మాచిరెడ్డి కృష్ణ, యిద్దం త్రిమూర్తులు, కె.నిర్మల కుమారి, చలసాని కళ్యాణ్, జాలీ వాకర్‌గా ఎం సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం ఉమా మహేశ్వర రావు, యూఆర్‌కే పట్నాయక్ ఎన్నికయ్యారు. క్లబ్ డైరెక్టర్లుగా కోనేరు రవీంద్రనాథ్ ఠాగూర్, ఎస్ కోటేశ్వర రావు, ఎస్ అప్పారావు, బి.వరప్రసాద్, బి.అనురాధ, కె.గంగ ఎన్నికయ్యారు. నూతన ప్రతినిధులకు పలువురు వాకర్స్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్రమణ తొలగించాలని ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నిడమర్రు: అడవికొలను వెలంపేట రామాలయం వీధిలో దిగువ నీరు వెళ్లకుండా కచ్చా డ్రెయిన్ అడ్డుగా ఉన్న ఆక్రమణను తొలగించాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రామాలయం వీధిలో నివాసం ఉంటున్న సొసైటీ ఉద్యోగి అంబటి ఏసు డ్రెయినేజీ స్థలాన్ని ఆక్రమించి అడ్డుగా పెద్దపెద్ద బండరాళ్లు ఉంచడంతో కచ్చాడ్రెయిన్‌లో మురుగునీరు పారుదలకు ఆటకం ఏర్పడిందని నాయకులు తెలిపారు. రోడ్డుపై మురుగునీరు చేరడంతో స్థానికంగా ఉంటున్న 20 కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సొసైటీ ఉద్యోగికి స్థానిక కూటమి నేతలు సహకరిస్తున్నారని విమర్శించారు. అధికారులు తక్షణం స్పందించి సర్వే చేసి కచ్చా డ్రెయిన్ తవ్వించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ విజయ కుమారికి రామాలయం వీధి వాసులు వినతిపత్రం అందించారు.

కలలను సాకారం చేసుకోవాలి


విద్యార్థినికి మెడల్ వేస్తున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: కలలు కనడమేకాక, వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీలో మూడో ఏడాది పూర్తిచేసిన విద్యార్థులకు వీడ్కోలు, కళాశాల 54వ వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి సాధనలో నిమగ్నమవ్వాలని, కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో మంచి విజయాలు అందుకోవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయకూడదని, వారిని ఏకష్టం రాకుండా చూసుకోనేందుకు మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ చైతన్య, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, కేవీ గణేష్, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కంకర లారీల సీజ్

ఉంగుటూరు: పోలవరం కాలువ గట్టు నుంచి తరలిస్తున్న కంకర లారీలను కంసాలిగుంట గ్రామం వద్ద ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి ఏరియా నుంచి కంకరను లారీల్లో తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరిగేషన్ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

14, 18, 28 తేదీల్లో జాబ్ మేళాలు

ఏలూరు (టూటౌన్): సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సీడాప్ వారి ద్వారా ఈనెల 14, 18, 28 తేదీల్లో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్టు మైనారిటీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎన్ఎస్ కృపావరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి లేదా జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారిని స్వయంగా లేదా ఫోన్ నెంబర్ 98499 01162లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సినీ నటుడు మురళీమోహన్ గృహప్రవేశం

ఏలూరు రూరల్ : చాటపర్రులో సినీనటుడు మురళీమోహన్ మంగళవారం గృహప్రవేశం చేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. మురళీమోహన్ స్వగ్రామం చాటపర్రు గ్రామం. ఆయన పుట్టి పెరిగిన ఇల్లు శిథిలావస్థకు చేరడంతో కొంతకాలంగా మరమ్మతులు చేపట్టారు. బంధువులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. పలు ప్రాంతాల నుంచి అభిమానులు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

పెదవేగి : పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు పరసా నాగార్జున ఆకాంక్షించారు. మంగళవారం పెదవేగి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్, రెండు బ్లూ పెన్నులు, పెన్సిల్, లాంగ్ స్కేల్, వృత్తలేఖిని, హాల్ టికెట్ పౌచ్‌లను ఎస్‌టీయూ మండల శాఖ తరపున అందజేశారు. ఎంఈఓలు నరసింహమూర్తి, అరుణ్ కుమార్, సర్పంచ్ శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపరాల రైతుల ధర్నా

పెదపాడు : రైతుల పాలిట శాపంగా ఉన్న అపరాల కొనుగోలు నిబంధనలను సవరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వట్లూరులో మంగళవారం అపరాల రైతులు ధర్నా చేశారు. గోనె సంచులు ఇచ్చి రైతుల వద్ద ఉన్న పెసర, మినుము పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని తెలిపారు. గతేడాది మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు అపరాలు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా దిగుబడులు బాగా తగ్గిపోయాయని, దీనికి తోడు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

ఏలూరు(మెట్రో): రాబోయే వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా వేసవి చర్యా ప్రణాళిక (సమ్మర్ యాక్షన్‌ప్లాన్)ను సిద్ధం చేయాలని అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని, బోర్లు, పైపులైన్లు, ట్యాంకుల మరమ్మతులు పూర్తిచేయాలని పద్మశ్రీ సూచించారు. సమావేశంలో జెడ్పీ డీసీఈఓ కె.భీమేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు


మహిళను ఆమె కుటుంబానికి అప్పగిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): భర్తతో మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన మహిళలను పోలీసులు కాపాడారు. ఏలూరు నగరంలోని వెంకటాపురం రామ్‌నగర్‌కాలనీకి చెందిన నాదెళ్ల జమునకు తన భర్తతో మనస్పర్థలు ఏర్పాడాయి. దీంతో ఆమె ఏలూరు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ షెడ్ రోడ్ వైపు వచ్చి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నం చేసింది. దీన్ని గమనించిన ప్రయాణికులు రైల్వే ఎస్సై సైమన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్సై తన సిబ్బందితో వచ్చి మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకుని ఆమెకు తన కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆమెను తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళను కాపాడిన రైల్వే పోలీసులను ప్రయాణికులు అభినందించారు.

పోలీస్ సొసైటీ రుణ పరిమితి పెంపు


ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌ను అభినందిస్తున్న సొసైటీ సభ్యులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ రుణ పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్‌కు సొసైటీ సభ్యులు మంగళవారం పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. రుణ పరిమితి పెంపుతో జిల్లాలో పోలీసు సిబ్బందికి ఆర్థికంగా మరింత మద్దతు లభించనుందని పేర్కొన్నారు. పోలీసు సిబ్బందికి ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ కోపరేటివ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, శానం రమేష్ బాబు, శ్రీరామ్, సభ్యులు ఉన్నారు.

‘యువత పోరు’ను విజయవంతం చేద్దాం


నౌడు వెంకట రమణ


యువత పోరు పోస్టర్ విడుదల చేసిన పార్టీ శ్రేణులు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంఅయిన బుధవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే విద్యార్థుల ఫీజు పోరు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. యువత పోరుకు విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగులు, యువజన సంఘాలు పాల్గొనేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. చంద్రబాబు సర్కారు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేస్తోందని వివరించారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాలు రూ.4,600 కోట్లు ఉండగా, తాజా బడ్జెట్‌లో రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. లబ్ధిదారుల సంఖ్యను కుదించేందుకే బడ్జెట్‌లో కోత విధించారని విమర్శించారు. ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3 వేలు ఇస్తామని బడ్జెట్‌లో ఒక్కరూపాయి కేటాయించలేదని తెలిపారు. బీసీ సంఘాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొని యువత పోరును విజయవంతం చేయాలని కోరారు.

యువత పోరు పోస్టర్ విడుదల

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12న ఏలూరులో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని కోరారు. మంగళవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు నాని ప్రజాప్రతినిధులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, సర్పంచులు ప్రభుదేవా, రఘు నాయకులు తేజ, ఉదయ్, శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు చేబ్రోలులో..

ఉంగుటూరు: చేబ్రోలులో బుధవారం ఉదయం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని, అనంతరం ఏలూరులో జరిగే యువత పోరు కార్యక్రమానికి హాజరవుతురని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ మూడో లైన్ ఏర్పాటుపై అభ్యంతరం


విద్యుత్ మూడో లైన్ పనులను నిలుపుదల చేసిన ప్రజలు

ఉంగుటూరు: కైకరం గ్రామం పడమట వీధిలో మూడో విద్యుత్ లైన్ ఏర్పాటును ప్రజలు మంగళవారం అడ్డుకున్నారు. ఇప్పటికే రెండు వరసల లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లగా, మరో లైను వేస్తే భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చేపలు, రొయ్యల చెరువుల కోసం వేస్తున్న ఈ లైను పనులకు గత వారం రోజుల నుంచి అభ్యంతరాలు చెబుతున్నా అధికారులు, కాంట్రాక్టరు మొండిగా పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. సబ్‌స్టేషన్ నుంచి పొలాలు మీదుగా లైను వేసే వీలున్నప్పటికీ ఇళ్లపై నుంచే లైను వేయడాన్ని వారు తప్పుపట్టారు. ఇటీవల లైన్లు క్రాస్ అవడంతో మంటలు వ్యాపించి ఇళ్లలో ఫ్రిజ్జులు, ఫ్యానుల వైరింగ్ కాలిపోయి నష్టపోయామని గ్రామానికి చెందిన నక్క శ్రీను, నడివిండి శ్రీనులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడో లైన్ పనులు నిలుపుదల చేయకపోతే కలక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	40
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – తిరుపతి	16.0	4830	32